# 18

## జోస్యం నిజమైంది

"మీకోసం బాలాజీరావుగారొచ్చి సావిట్లో కనిపెట్టుకూర్చున్నారండీ" అంది బంగారమ్మ.

"'లేదు' అని చెప్పలేకపోయావా?" అన్నాడు పరంధామయ్య.

"అబద్ధమాడవలసిన ఖర్మమేమొచ్చిందండీ? ఆయనేమైనా అప్పు అడగడానికొచ్చాడనా భయం?"

"అందుకైతే బాగానే వుండును. 'మీకు దీనివల్ల కీర్తి వచ్చిపడుతుం'దంటో ఏదో ప్లాను వేసివచ్చి, నా డబ్బు తగలెట్టిద్దాంమని చూస్తాడు!"

"కీర్తి ఊరికే వస్తుందండీ మరి? ఇంతకీ ఉన్నవాళ్ళం గనుక అవసరమైనప్పుడు ఖర్చుపెట్టాలి."

"ఇంట్లో హాయిగా కాలుమీద కాలు వేసుకూర్చున్న వాణ్ణి ఎలెక్షన్లంటూ బయటికి లాగి, కానీ ఖర్చు లేకుండా నెగ్గిస్తానని నమ్మించి, పదివేలు ఖర్చు పెట్టించాడు!"

"ఇనప్పెట్టెలో లక్షలు మూలుగుతోన్న మనకి పదివేలో లెక్కటండీ? ఆయనధర్మమా అంటూ మీరా ఎన్నికలో గెలిచినప్పట్నుంచీ ఎంతో పేరూ, ప్రతిష్ఠా వచ్చాయి."

"ఈ పేరూ ప్రతిష్ఠా ఎందుకూ అంటాను!"

పరంధామయ్యగారు పైకి అలా అన్నాడేకాని 'కీర్తి' అంటే ఆయనకూ ఇష్టమే. కాని ఆయన కోరేది ఆ కీర్తి యేదో డబ్బు ఖర్చుకాకుండా రాకూడదా అని!

పరంధామయ్యగారు బెదురుతోనే సావిట్లోకి వెళ్ళేరు. అక్కడ బాలాజీరావుతోపాటు, కుండలాలు ధరించి శాలువా పైన వేసుకునివున్న మరొక వ్యక్తికూడా ప్రత్యక్ష మయాడు.

"వీరెవరు?"

"వీరు గొప్ప జ్యోతిష్కులు పరంధామయ్యగారూ. వీరికి 'సిద్ధాంత శిరోమణి', 'దైవజ్ఞ చక్రవర్తి' వగైరా బిరుదులెన్నో ఉన్నాయి. ఈయన జ్యోతిషానికి పార్వతిశాపంకూడా పని జెయ్యదు. వీరుచెప్పిన ఫలితాలన్నీ తు. చ. తప్పకుండా జరిగితీరుతాయి. మీ జాతకం చూపించుకుంటారని తీసుకొచ్చాను" అన్నాడు బాలాజీ.

పరంధామయ్యగారు జ్యోతిషమంటే నమ్మకమున్నవాడే. కాని ఆ వచ్చినాయన 'గొప్ప' జ్యోతిష్కుడంటున్నాడు

బాలాజీ. గొప్పవాళ్ళకి గొప్ప సత్కారం చేస్తేగాని వప్పుకోరు! ఎంత వదుల్తుందో మరి?

పరంధామయ్యగారు ఒక నిశ్చయాని కొచ్చి, "నాకు జాతకం లేదండీ." అనేశారు.

"జాతకమే అక్కర లేదు బాబూ. నాకు సాముద్రికం కూడా బాగా తెలుసు." అన్నాడా సాముద్రికుడు.

బంగారమ్మ, "చూపించుకోండి. ఏం చెపుతారో విందాం" అని ప్రోత్సహించింది. పరంధామయ్యగారి కిక తప్పని సరైంది.

సాముద్రికుడు చేతిలోని రేఖలన్నీ నిదానంగా పరిశీలించి, "మీది చాలా గొప్ప ధనజాతకం," అన్నాడు. ఇంకొక నిముషం పరికించి "సంతానయోగం చాలా పరిమితిగా ఉన్నది," అన్నాడు. "ప్రతీ స్వల్పవిషయంకూడా మీకు అలజడి కలిగిస్తోంటుంది...దాని కేంగాని, అన్నిటికన్నా ముఖ్య విషయం—మీ హస్తంలో అఖండమైన ఖ్యాతి కనబడుతోంది. మీ పేరు శాశ్వతంగా నిలిచిపోయే కార్యమేదో జరుగుతుంది."

"నావల్ల జరిగే ఘనకార్య మేముంటుంది లెండి," అన్నాడు పరంధామయ్య.

బాలాజీ, "అదేమన్నమాట పరంధామయ్యగారూ! మీరు తలచుకుంటే ఒకగుడి కట్టించవచ్చు; సత్రం ఏర్పాటు చేయించవచ్చు; పాఠశాల స్థాపించవచ్చు; ఆస్పత్రి..."

పరంధామయ్య అడ్డువచ్చి, "అవన్నీ ఒహాడివల్ల అయే పనులటయ్యా?" అనేశాడు.

కార్తాంతికుడు తాంబూలం పుచ్చుకుని వెళ్ళిపోయాడు. బాలాజీరావు మరో రెండు నిముషాలు పిచ్చాపాటీ ముచ్చటిస్తో, పరంధామయ్యగారేదో పరధ్యానంగా ఉండడం గమనించి, శలవు తీసుకున్నాడు.

పరంధామయ్యకు నాటినుంచీ పుట్టెడు బెంగ పట్టుకుంది. "మీ పేరు శాశ్వతంగా నిలిచిపోయే కార్యమేదో జరుగుతుంది" అన్నాడు సాముద్రికుడు. "ఆస్పత్రియో, బడియో, గుడియో, గోపురమో, సత్రమో కట్టించవచ్చు" అన్నాడు బాలాజీ. ఆ మధ్య పండితుడొకాయన, "నేను అష్టాదశ పురాణాలనూ వచనంలో, అందరికీ అర్థమయే శైలిలో వ్రాయదలచుకున్నాను. మీకు కృతి ఇస్తాను. సంపుటాలుగా అచ్చువేయించిపెట్టండి" అన్నాడు. "కృతిస్వీకారము సప్తసంతానాలలో ఒకటి. దానివల్ల మీ కీర్తి చిరస్థాయిగా ఉంటుంది. మీ రొక గుడికట్టిస్తే పడిపోవచ్చు. బావి తవ్విస్తే పూడిపోవచ్చు. చెఱువు చెడిపోవచ్చు. చెడనిది కృతియే! శాశ్వతంగా నిలిచిపోతుంది" అని శ్లాఘించాడు.

ఆ మాటలు నెమరుకు వచ్చేసరికి ఆయనగుండె దడదడా కొట్టుకోసాగింది. ఆ సాముద్రికుడు సూచించిన కీర్తి తన ధనమేషాన్ని కబళించడానికి పొంచిఉన్న వ్యాఘ్రంలా గోచరించింది పరంధామయ్యగారికి.

సత్కరించడాని కయే ఖర్చు తప్పించుకోడానికి, "నాకు

జ్యోతిషంలో నమ్మకం లేదు'' అని ఆయన అంటాడే కాని ఆయన కా శాస్త్రంలో ఉన్నంత నమ్మకం మరెవరికీ లేదు. తన పేరు శాశ్వతంగా నిలిచిపోయే ఏర్పా టేదో జరుగనున్న దనీ, తన డబ్బు కాస్తా తగులబడిపోవడాని కిది కారణమనీ దిగులుచెంది అతడు నిద్రాహారాలు మానుకున్నాడు.

బాలాజీరావు చెప్పినట్లు ఆ శాస్త్రజ్ఞుని జ్యోతిషానికి పార్వతిశాపం తగల్లేదు. ఆయనసాముద్రికం నిజమై తుదకు పరంధామయ్యగారి పేరు శాశ్వతంగా నిలిచిపోయే సంఘటన ఒకటి జరిగింది. కాని ఆయన భయపడ్డట్లు ధనవ్యయం మాత్రం కాలేదు. ఆ సొమ్మంతా చెక్కు చెదరకుండా ఇనప్పెట్టెలో అలాగే ఉండిపోయింది.

నదికి ఆవల గ్రామంలో ఏటేటా దేవునికి కల్యాణాది ఉత్సవాలు జరుగుతోంటాయి. ఆ తిరునాళ్ళకు ఎక్కడెక్క డున్న జనం చేరుతోంటారు.

''దగ్గరుండికూడా మనంఎన్నడూ వెళ్ళలేదు. ఈ యేడు వెడదామా?'' అన్నది బంగారమ్మగారు.

''మగనితో పెళ్లికివెడితే ఆడదానికి సుఖముండనట్లే భార్యతో తీర్థానికి వెడితే మగవానికి సుఖముండదు'' అన్నా డాయన.

''ఎందువల్ల? తిరునాళ్లలో కనపడ్డ వస్తువేదైనా కొన మంటాననేనా? ఈ సొమ్మంతా కూడా తీసుకుపోతాముటండీ? మీకు ఇష్టంలేకపోతే నేను రావడం మానేస్తాను: మీరు వెళ్లి రండి'' అన్నది బంగారమ్మ చిరుకోపంతో.

తా నొక్కడూ వెళ్ళినా కొంత ఖర్చు తప్పదుగా అని పించింది పరంధామయ్యకు మొదట. కాని రామన్న కీర్తిని తప్పించుకోవడం అతనితరమా? బయల్దేరి వెళ్ళేడు.

కల్యాణమండపంలో ఆయన్ని ముందుకు తీసుకుపోయి కూర్చోపెట్టేరు. ఆలయానికి గొప్పవాళ్ళొస్తే జరిపే మర్యాద లన్నీ జరిపేరు.

మర్నాడు అందరితో బాటు ఆయన తిరుగుప్రయా ణానికి నదిఒడ్డుకు వచ్చాడు.

రేవువద్ద జనం తోడతొక్కిడిగా ఉన్నారు.

అంతమంది జనంలో ఆ పడవలో రేవు దాటడం కష్ట మనిపించి కొందరు ప్రత్యేకంగా రూపాయో, రెండూ ఇచ్చి నావలు కట్టించుకుని అద్దరిచేరుకున్నారు.

ప్రజాప్రతినిధి పరంధామయ్యగారు సామాన్య ప్రజానీ కంతో బాటు రేవు పడవలోనే ఎక్కి నదిని దాట సంకల్పిం చారు.

త్వరగా అవతలకు చేరుకోకపోతే పుట్టి మునిగిపోతుం దన్నట్లుగా ఎక్కవలసిన వాళ్ళకంటే రెట్టింపుజనం ఎక్కేరా పడవలో.

నదిమధ్యకు పడవ వచ్చింది. ఒక పిల్లవాడు తీర్థంలో కొని తెచ్చుకున్న 'బెలూను'తో ఆడుకుంటున్నాడు. గాలి దెబ్బకు ఆ బెలూను వాడి చేతిలోంచి ఎగిరి నదిలో పడిపో యింది. దాన్ని దక్కించుకోవాలని ఆ పిల్లవాని తల్లి అటు ఒరి గింది. ఏమిటో అన్నట్లుగా జనమంతా అటు ఒరిగేరు. పడవ

బోర్లగిలాపడి, ఆ రెండునందల పైచిల్లరా నదీగర్భంలో ఇమిడి పోయారు.

ఆ పడవ ప్రమాదంలో ప్రాణాలు గోల్పోయినవారి పేర్ల జాబితాను పత్రికలు ప్రకటించాయి. గొప్పవాడూ, లక్షాధికారీ ఐన పరంధామయ్యగారి పేరు పెద్ద అక్షరాలలో పడింది.

ప్రమాదానికి కారణ మేమిటో పరిశీలించటంకోసం ఒక విచారణసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఈదుకొచ్చి ప్రాణాలు రక్షించుకో గలిగిన పడవకళాసు లందరిపైనా నేరారోపణ జరిగి, వారు శిక్షింపబడ్డారు.

"ఇలాంటి ప్రమాదాలు ఇంక జరగకుండా ఉండటా నికి ప్రభుత్వం తీసుకోబోతోన్న చర్య ఏమిటి?" అని శాసన సభలో ఒక ప్రశ్న వేశారు.

"ఆ ప్రదేశంలో నదికి ఒక వంతెన వేయిస్తున్నాం." అన్నారు మంత్రిగారు.

ఆ వంతెనకు ఎవరిపేరు పెడితే బాగుంటుందీ అని యోచించారు. లక్షాధికారీ, గొప్పవాడూ ఐన పరంధామయ్య పేరు పెట్టడం సమంజసం అనిపించింది. ఆ వంతెన రూపంలో ఆయనపేరు శాశ్వతంగా నిలిచిపోయింది. జోస్యం నిజమైంది!

—